క్లుప్తంగా

విద్యార్థులు నైపుణ్యం పెంపొందించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ-1సామల

బలిజిపేట: పదవ తరగతి విద్యార్థులు వారి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని ఎంఈఓ-1సామల సింహాచలం అన్నారు. ఈ మేరకు మండలంలోని అరసాడ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు నిర్వహించిన ఫేర్‌వెల్ ఫంక్షన్‌కు బుధవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పదవ తరగతి వరకు ఇక్కడ చదువుకున్న దానికంటే భవిష్యత్ ఎంతో కీలకమైనదన్నారు. ఇకపై మీ నైపుణ్యాలను పెంచుకునే సామర్థ్యాన్ని మీరు సాధించాలని సూచించారు. పదిపరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్త్రీనిధి రుణాల వసూలులో నిమగ్నం



మాట్లాడుతున్న వెలుగు ఏపీఎం ఆర్ శ్రీరాములు

సీతానగరం: మండలంలోని వెలుగు మండల సమాఖ్య పొదుపు సంఘాలు బ్యాంకుల ద్వారా తీసుకున్న స్త్రీనిధిరుణాలు ఈ ఆర్థికసంవత్సరానికి వసూలు చేసే పనుల్లో సిబ్బందితో నిమగ్నమయ్యామని ఏపీఎం రెడ్డి శ్రీరాములు అన్నారు. ఈ మేరకు స్థానిక వెలుగు మండల సమాఖ్య కార్యాలయంలో సిబ్బందితో బుధవారం సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్త్రీనిధి పథకం ద్వారా రుణాలు పొందిన వారినుంచి బ్యాంకులకు శతశాతం రుణాలు చెల్లించాలని సంకల్పించగా 96 శాతం మంది రుణాలు చెల్లించారన్నారు. అలాగే 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఉన్నతి ద్వారా రూ 5.5 కోట్లు వెయ్యి మందికి రుణాలు ఇవ్వాలని సంకల్పించగా ఇప్పటివరకూ 752 మందికి రూ.4.52 కోట్లు అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో సీసీలు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



పరమశివుడికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

పార్వతీపురం రూరల్: మండలంలోని పెదమరికి పంచాయతీ శివన్నదొరవలస గ్రామంలో గల శ్రీ రామలింగేశ్వర స్వామి వారి దేవాలయ 7వ వార్షికోత్సవ పూజలను భక్తులు భక్తి శ్రద్ధలతో బుధవారం నిర్వహించారు. పరమశివుడికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ప్రతి ఏటా ఆలయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఆస్పత్రిలో కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కరించండి



ఆర్ఎంఓ డా. శ్యామలకు వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

పార్వతీపురంటౌన్: ఆస్పత్రుల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఆర్వీఎస్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లాలో ఉన్న ఆస్పత్రుల్లో కాంట్రాక్టు కార్మికులుగా విధులు నిర్వహిస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ గార్డులు, సూపర్‌వైజర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై బుధవారం జిల్లా ఆస్పత్రి ఆర్ఎంఓ డా.శ్యామలకు ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్-వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు అలజంగి కుమారమ్మ, రవి, కమల, ఎస్.శంకరరావు, సుధీర్, రామారావు, త్రినాథ, అనూరాధ, వెంకటరమణ, రాజు, పార్వతీపురం జిల్లా ఆస్పత్రి, పాలకొండ, సీతంపేట ఏరియా ఆస్పత్రుల శానిటేషన్, సెక్యూరిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పీ-4 సర్వేపై అపోహలు వద్దు

పార్వతీపురం రూరల్: పబ్లిక్ ప్రైవేట్ పీపుల్స్ పార్టిసిపేషన్ (పి-4) సర్వేపై అపోహలు వద్దని పార్వతీపురం ఎంపీడీఓ జీవీ రమణమూర్తి పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన బుధవారం అడ్డాపుశీల సచివాలయం పరిధిలో ఉన్న గ్రామాలను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ విధానాన్ని అమలు చేస్తోందని చెప్పారు. పేదల జీవన ప్రమాణాలు మెరుగుపర్చడానికి ఈ సర్వే ఎంతగానో దోహదపడుతుందని, ఈ సర్వేపై ప్రజలకు ఎలాంటి అనుమానాలు వద్దన్నారు. సచివాలయ సిబ్బంది పక్కా ప్రణాళికతో రోజూ సర్వే చేయాలని సూచించారు. గ్రామాల్లో ప్రజలు వారి ఉపాధి, వృత్తుల రీత్యా ఉదయమే బయటకు వెళ్లి సాయంత్రం తిరిగి ఇంటికి వచ్చే అవకాశం ఉన్నందున ఆయా వేళల్లో సర్వే చేయాలని సూచించారు.

పారిశుధ్యం పాటిస్తే.. స్వచ్ఛ సమాజం



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్

పార్వతీపురం టౌన్: పారిశుధ్యాన్ని పాటించి స్వచ్ఛ సమాజాన్ని ఏర్పాటు చేద్దామని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ పిలుపునిచ్చారు. స్వచ్ఛ సుందర పార్వతీపురం కార్యక్రమంలో భాగంగా బుధవారం కలెక్టరేట్ నుంచి ఆర్‌సీఎం వరకు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ మొత్తం స్వచ్ఛ సుందర పార్వతీపురం, పారిశుధ్య నిర్వహణ, ప్లాస్టిక్ వినియోగం దుష్ప్రభావాల నినాదాలతో సాగింది.

ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలి

ఆర్‌సీఎం వద్ద జరిగిన సభా కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ పారిశుధ్యం అత్యావ శ్యకమన్నారు. పారిశుధ్యంతో ఆరోగ్యం ముడిపడి ఉందని పేర్కొన్నారు. మంచి సమాజానికి పారిశుధ్యం తప్పనిసరి అని తద్వారా మంచి ఆరోగ్యం కలిగి ఉండడమే కాకుండా ఉత్పాదక శక్తి పెరుగుతుందని పేర్కొన్నారు. ఈ మహత్తర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, దేశంలోనే పార్వతీపురం మన్యం జిల్లాను ఆదర్శ జిల్లాగా నిలపాలని కోరారు. ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలని పిలుపునిచ్చారు. పార్వతీపురం, సాలూరులలో మురుగు నీటి శుద్ధి ప్లాంట్‌లు మంజూరయ్యాయన్నారు. స్వచ్ఛ ఆంధ్రా కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అర్జునరావు మాట్లాడుతూ స్వచ్ఛ ఆంధ్రా రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించిందన్నారు. పారిశుద్ధ్యంపై అవగాహన పెంచుకోవాలని, ప్రతి ఒక్కరూ వ్యక్తిగత మరుగుదొడ్లు కలిగి ఉండాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. రామచంద్రరావు, జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకర రావు, జిల్లా గ్రామ పంచాయతీ అధికారి కొండలరావు, విజయనగరం, శ్రీకాకుళం జిల్లా పరిషత్‌ల డిప్యూటీ సీఈఓ ఆర్వీ రామన్, సత్యనారాయణ, జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్ తిరుపతి నాయుడు, జిల్లా సహకార అధికారి పి.శ్రీరామమూర్తి, జిల్లా మత్స్య శాఖ అధికారి వి.తిరుపతయ్య, జిల్లా మహిళా శిశు సంక్షేమ, సాధికారత అధికారి డా.టి కనకదుర్గ, జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి ఎస్.కృష్ణవేణి, జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారత అధికారి ఎం.డి.గయాజుద్దీన్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఎస్ భాస్కర రావు, స్వచ్ఛ ఆంధ్రా కార్పొరేషన్ కన్సల్టెంట్ శ్రీనివాసన్, స్వచ్ఛ సుందర పార్వతీపురం ప్రతినిధి పద్మజ, పట్టణ ప్రముఖ వైద్యుడు ద్వారపురెడ్డి రామమోహన్ రావు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బడే నాగభూషణ రావు, ఘన, ద్రవ వనరుల నిర్వహణ కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జగన్ ప్రజల మనిషి

- చంద్రబాబు ముఖ్యమంత్రి పదవికి అనర్హుడు
- డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర
- ఘనంగా వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం



వైఎస్సార్‌విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సాలూరు: ఎన్నికలప్పుడే రాజకీయాలని తరువాత ప్రజలందరూ నావారే అని, పార్టీలకతీతంగా అర్హతే ప్రామాణికంగా ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందించిన జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల మనిషని, వైఎస్సార్‌సీపీ ప్రజల పార్టీ అని మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర అన్నారు. బుధవారం వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సాలూరు పట్టణంలోని వైఎస్సార్ విగ్రహం కూడలి వద్ద వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేసి కేక్ కట్‌చేసి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా రాజన్నదొర మాట్లాడుతూ, వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి నేటివరకు అనేక పోరాటాలు చేసిందని గుర్తుచేశారు. రాగద్వేషాలకు అతీతంగా వ్యవహరిస్తానని ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన చంద్రబాబు ఇటీవల గంగాధర నెల్లూరులో నిర్వహించిన సమావేశంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులకు ప్రత్యక్షంగా పరోక్షంగా ఎటువంటి ఉపకారం చేయవద్దంటూ కించపరిచేలా మాట్లాడిన చంద్రబాబు ముఖ్యమంత్రి పదవికి అనర్హుడని పేర్కొన్నారు. కలెక్టర్ల సమావేశంలోనూ మా పార్టీ కార్యకర్తలకు చూడాలని చంద్రబాబు పేర్కొన్నారని గుర్తుచేశారు. వీటిపై వైఎస్సార్‌సీపీ అధిష్టానం కోర్టులో కేసు వేయాలని లేకుంటే, పార్టీ ఆదేశిస్తే తానైనా కేసు వేస్తానని తెలిపారు. చంద్రబాబుకు,జగన్‌మోహన్‌రెడ్డిల మధ్య తేడాకు ఈ వ్యాఖ్యలు నిదర్శనమన్నారు.

బాబు ష్యూరిటీ, మోసాలు, వంచనకు గ్యారంటీ

బాబు ష్యూరిటీ మోసాలు, వంచనకు గ్యారంటీ అంటూ రాజన్నదొర తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ప్రతి నెలా ఏదో ఒక పథకం ద్వారా ప్రజలకు డబ్బులు నేరుగా వారి బ్యాంక్ ఖాతాల్లో జమయ్యేవన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నేటికీ ఎటువంటి పథలు ఇవ్వలేదని దుయ్యబట్టారు. ఇకనైనా కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలుచేయాలని, లేకుంటే ప్రజల తరపున వైఎస్సార్‌సీపీ ఎప్పుడూ నిలబడి పోరాడుతుందని పునరుద్ఘాటించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మూడవ రోజుకు చేరిన మున్సిపల్ కార్మికుల సమ్మె



మాట్లాడుతున్న నాయకులు

సాలూరు: జీతాల బకాయి లేకుండా ఒకటో తేదీన చెల్లించాలని,తమ సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులు చేపట్టిన మెరుపు సమ్మె మూడవరోజుకు చేరింది. వారి సమ్మెకు మద్దతు పెరుగుతోంది. ఈ సందర్భంగా మున్సిపల్ యూనియన్ మహిళా కమిటి కో కన్వీనర్ జి.స్వప్న, టి.సీతలు మాట్లాడుతూ, మున్సిపాలిటీలో ప్రజలకు పారిశుధ్యం, నీరు, కరెంట్ సమయానికి అందిస్తున్న కార్మికుల ఆకలి బాధలు తీర్చేందుకు పాలకవర్గానికి సమయం లేకుండా పోయిందని విమర్శించారు. మున్సిపల్ కార్మికుల జీతాలు ప్రతి నెలా ఇవ్వాలన్న ఆలోచన పాలకవర్గం, అధికారులు, ప్రజాప్రతినిధులకు లేకపోవడం దురదృష్టకరమన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా పాలకులు, అధికారులు ఇదే వైఖరి కొనసాగిస్తే, సమ్మెను ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు.ఈ సమ్మెకు మున్సిపల్ పాలకవర్గమే బాధ్యత వహించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు శంకరరావు, రవి, పోలరాజు, వెంకన్న, హరి, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

జంఝావతిపై అసెంబ్లీలో చర్చించాలి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవన్న

పార్వతీపురం: ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీలో జంఝావతి ప్రాజెక్టు సమస్యపై చర్చించి సమస్యను పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవన్న పాలకులను డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జంఝావతి ప్రాజెక్టు నిర్మాణం పూర్తికావాలంటే ఒడిశా రాష్ట్రంతో ఉన్న సమస్యను పరిష్కరించేలా చొరవ చూపాలని సూచించారు. 2015లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మంత్రులు, ఇంజినీరింగ్ అధికారులు ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌తో చర్చించగా ప్రాజెక్టుకు సంబంధించిన సమస్య పరిష్కారం కోసం ఒడిశా ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు. దీంతో 2016లో ప్రాజెక్టు పనులు చేపట్టేందుకు రూ.39 కోట్లు ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. కాలువల నిర్మాణానికి భూములిచ్చిన రైతులకు పరిహారం అందించకుండా పనులు చేపట్టడంతో భూములిచ్చిన రైతులు పనులను అడ్డుకోవడంతో పనులు ఎక్కడివక్కడే నిలిచిపోయాయన్నారు. రైతులకు పరిహారం చెల్లిస్తే పనులు ముందుకు సాగే అవకాశం ఉన్నప్పటికీ పాలకులు ఎందుకు తాత్సారం చేస్తున్నారో తెలియడంలేదన్నారు. ప్రాజెక్టుపనులు పూర్తిచేసేందుకు పాలకులు అంకితభావంతో చర్యలు చేపట్టాలని కోరారు. సమావేశంలో కార్యవర్గ సభ్యులు జి.సూరయ్య, బి.మోహనరావు, బీటీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా మరమ్మతులు



రోలింగ్ చేయకుండా వదిలేసిన రోడ్డు, (ఇన్‌సెట్లో) మరమ్మతులు చేసినా రోడ్డు మధ్యలో కనిపిస్తున్న గోతులు

బలిజిపేట: బలిజిపేట ఆర్అండ్‌బీ రోడ్డు మరమ్మతు పనులు మొక్కుబడిగా నిర్వహిస్తుండడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మిర్తివలస నుంచి బలిజిపేట వరకు 3కిలోమీటర్ల పొడవునా రూ.5లక్షలతో మరమ్మతులు నిర్వహిస్తున్నారు. పనులు ఎవరు నిర్వహిస్తున్నారో తెలియడం లేదని, కనీసం అధికారుల పర్యవేక్షణ లేదని ప్రజలు చెబుతున్నారు. చేపట్టిన మరమ్మతు పనులు నాణ్యత లోపాలతో ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గోతులతో పాటు రోడ్డుపైనా కింద నామమాత్రంగా తారువేసి పైన పిక్కవేసి తారువేసి రాయిబుగ్గి జల్లి వదిలేస్తున్నారు తప్ప రోలింగ్ చేయడం లేదని చెబుతున్నారు. గోతులు ఉన్న చోట మళ్లీ గోతులు కనిపిస్తున్నాయని ఇవేం మరమ్మతు పనులని ప్రశ్నిస్తున్నారు. చిన్న, చిన్న మరమ్మతు పనులు సక్రమంగా నిర్వహించలేని అధికారులు, కాంట్రాక్టర్ల తీరుపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఏఈ రామ్మోహన్‌ను వివరణ కోరగా పనిపూర్తయిన తరువాత రెండు రోజులు తరువాత రోడ్డు బాగుంటుందని, రోలింగ్ చేసే అవసం లేదన్నారు.

పీ-4 సర్వే శరవేగంగా చేయాలి



అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్



నిడగల్లులో పీ4 సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ త్రివిక్రమరావు

పార్వతీపురంటౌన్: పీ-4 సర్వే శరవేగంగా చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పీ-4 సర్వేకు సంబంధించి అవగాహన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 2.50 లక్షల గృహాలకు పీ-4 సర్వే చేయాల్సి ఉందన్నారు. మార్చి 8 నుంచి ప్రారంభమైన ఈ సర్వే ఈనెల 15 నాటికి పూర్తి చేయాలని చెప్పారు. ప్రతి మంగళ, శుక్రవారాల్లో జిల్లా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని సూచించారు. మండల ప్రత్యేకాధికారులు ఈ విషయమై తహసీల్దార్, ఎంపీడీఓలతో పర్యవేక్షణలో వేగవంతం చేయాలని సూచించారు. ఇప్పటికే జిల్లాలో దాదాపు 30శాతం సర్వే పూర్తయ్యిందని, మిగిలిన 70శాతం సర్వే ఈ వారంలోగా పూర్తి కావాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సంబంధిత శాఖాధికారులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పి 4 సర్వే వేగవంతం చేయాలి

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో సచివాలయ ఉద్యోగులు నిర్వహిస్తున్న పీ 4 సర్వే కలెక్టర్ ఆదేశాలమేరకు నాలుగు రోజుల్లో పూర్తి చేయాలని ఎంపీడీఓ పి.త్రివిక్రమరావు అన్నారు. ఈ మేరకు బుధవారం నిడగల్లు, వెంకటాపురం గ్రామాల్లో జరుగుతున్న పీ 4 సర్వే పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శి, వీఆర్వోలు, డీఏలు, మహిళా రక్షణ కార్యదర్శులు, గ్రామసర్వేయర్లు, ఇతర సిబ్బందితో పీ4 సర్వే కార్యక్రమం జరుగుతున్నట్లు చెప్పారు. సర్వే వేగవంతం చేయాలని ఉన్నతాధికారుల నుంచి వస్తున్న ఒత్తిడిలో భాగంగా నాలుగు రోజుల్లో సర్వే పనులు పూర్తి చేయడానికి చర్యలు తీసుకున్నామని తెలియజేశారు. సర్వే విషయంలో వెనుకబడి ఉన్న అధికార సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.

సారా ఆరోగ్యానికి ప్రమాదకరం



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ప్రొహిబిషన్ అసిస్టెంట్ కమిషనర్ పి.రామచంద్రరావు

సాలూరు రూరల్: సారా ఆరోగ్యానికి ప్రమాదకరమని గ్రామాల్లో తయారీదారులు తాగేవారు సారాకు దూరంగా ఉండాలని ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ పి.రామచంద్రరావు అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన నార్లవలస పంచాయతీ నక్కడవలస గ్రామంలో నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా గిరిజనులకు సారాపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజనులను చైతన్య పరిచేందుకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. గ్రామాల్లో సారా అమ్మకం జరిగితే అధికారులకు ఫిర్యాదు చేయాలని కోరారు. కార్యక్రమంలో తాహసీల్దార్ రమణమూర్తి, ఎక్సైజ్ సీఐ జి.దాసు, రూరల్ ఎస్సై నరసింహమూర్తి, గ్రామంలోని మహిళలు,యువత పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన పెంచుకోవాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ నరేష్

మక్కువ: క్షయ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని సాలూరు టీబీ సూపర్‌వైజర్ నరేష్ తెలిపారు. ఈ మేరకు మక్కువ మండలంలోని బొడ్డు సామంతవలస గ్రామంలో బుధవారం క్షయ వ్యాధిపై ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు వారాలకు నుంచి దగ్గు, జ్వరం, కఫం ద్వారా రక్తపు జీరలు వస్తే అవి టీబీ వ్యాధి లక్షణాలన్నారు. టీబీ లక్షణాలు కలిగిన వ్యక్తుల్లో ఆకారణంగా బరువు తగ్గుతుందన్నారు. టీబీ నిర్ధారణ అయితే ఆరు నెలలపాటు ఉచితంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మందులు అందించనున్నట్లు తెలిపారు. పోషకాహారాన్ని సక్రమంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అటవీ ఉత్పత్తులను కొనుగోలు చేయాలి

- ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాస్తవ



జీసీసీ సిబ్బందితో సమీక్షిస్తున్న ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాస్తవ

పార్వతీపురం: ఐటీడీఏ పరిధిలోని గిరిజన గ్రామాలకు వెళ్లి అటవీ ఉత్పత్తులను కొనుగోలు చేయాలని ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాస్తవ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు బుధవారం ఆయన కార్యాలయంలో జీసీసీ ద్వారా అందుతున్న సేవలపై గుమ్మలక్ష్మీపురం, సాలూరు, పార్వతీపురం పరిధిలోని జీసీసీ సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అటవీ ఉత్పత్తుల కొనుగోళ్లను గిరిజన గ్రామాలలో ప్రతి ఇంటివద్ద చేపట్టాలని సూచించారు. అటవీ ఉత్పత్తులను ఎప్పటికప్పుడు కోల్డ్‌స్టోరేజ్ , గొడౌన్లకు తరలించాలని చెప్పారు. గిరిజన ఉత్పత్తులను ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు కొనుగోలు చేసి వారికి ఆర్థికంగా చేయూత నివ్వాలని సూచించారు. నిర్దేశించిన లక్ష్యాలను తప్పనిసరిగా పూర్తిచేయాలని ఆదేశించారు. సమావేశంలో జీసీసీ డీఎం మహేంద్ర కుమార్, గుమ్మలక్ష్మీపురం, సాలూరు బ్రాంచ్ మేనేజర్‌లు కృష్ణప్రసాద్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ రవాణాను అరికట్టేందుకు పటిష్టంగా చర్యలు

- ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి



జాతీయరహదారిపై పోలీసు అధికారులకు సూచనలు చేస్తున్న ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి

పార్వతీపురం రూరల్: గంజాయి, మద్యం అక్రమ రవాణాను నియంత్రించేందుకు పటిష్టంగా చర్యలు అమలు చేయాలని ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన మాట్లాడుతూ మన్యం జిల్లా వ్యాప్తంగా ప్రాక్టికల్ శిక్షణ నిమిత్తం వచ్చిన ఎస్సైలకు శిక్షణ నిమిత్తం పోలీస్‌స్టేషన్లను కేటాయించామని ఈ మేరకు వారు ఆయా స్టేషన్ల సీఐ, ఎస్సైలతో కలిసి విధుల్లో పాల్గొంటారన్నారు. తరచూ స్టేషన్ల పరిధిలో ఉన్న గ్రామాలను వారు సందర్శించి, ప్రధానంగా ఏజెన్సీలో ఉన్న ప్రభావిత ప్రాంతాల్లో సందర్శించాలని, సైబర్ నేరాలపై అవగాహన, నక్సలిజం, మత్తు పదార్థాలు, నాటు సారా వల్ల కలిగే దుష్ప్రభావాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించినట్లు తెలిపారు.

ఎస్పీ ఆకస్మిక తనిఖీ



ప్రొబేషనరీ ఎస్సైల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ ఎస్‌వీ మాధవరెడ్డి

సాలూరు రూరల్: ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి బుధవారం సాలూరు రూరల్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రొబేషనరీ ఎస్సైలతో సమావేశమై వారు నిర్వహిస్తున్న విధుల గురించి అడిగి తెలుసుకున్నారు. తరచూ గ్రామాలను సందర్శించాలని ముఖ్యంగా గిరిజన గ్రామాల్లో ఉన్న సమస్యలపై దృష్టిసారించాలని సూచించారు. అక్కడి ప్రజలతో మమేకమై సైబర్ నేరాలు, నక్సల్స్, మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలను ఎప్పటికప్పుడు తెలియజేయాలని చెప్పారు. కూంబింగ్ ఆపరేషన్ గురించి తెలుసుకుని చుట్టుపక్కల ప్రాంతాలలో సంచరించే దళాలగురించి వారికి సహకరించే వారి గురించి సమాచారం సేకరించాలన్నారు. పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు ఇచ్చేందుకు వచ్చే వారితో సామరస్యంగా మెలగాలని సూచించారు. కార్యక్రమంలో సాలూరు పట్టణ సీఐ అప్పలనాయుడు, రూరల్ సీఐ రామకృష్ణ, రూరల్ ఎస్సై నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

చెత్త సేకరణలో చిత్తశుద్ధి కరువు

- నిర్లక్ష్యపు నీడలో సంపద సృష్టి కేంద్రాలు
- పట్టించుకోని అధికారులు

సాలూరు రూరల్: సంపద సృష్టి కేంద్రాలను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తామని ప్రగల్భాలు పలికిన ప్రభుత్వం ఆ కేంద్రాల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామాల్లో చెత్త సేకరణ చేసేవారికి జీతాలు ఇవ్వకపోవడంతో కొన్ని గ్రామాల్లో చెత్త సేకరించేవారే కరువయ్యారు. ఇంటింటి చెత్త సేకరణ ప్రస్తుతం పలు గ్రామాల్లో జరగడం లేదు. మామిడిపల్లి, కూర్మరాజుపేట ఇలా కొన్ని గ్రామాల్లో చెత్త సేకరణ జరుగుతున్నప్పటికీ ఆ చెత్త రోడ్డు పక్కన వేసి ప్లాస్టిక్ వ్యర్థాలను కాల్చేస్తున్నారు. దీంతో రోడ్డుపై ప్రయాణించేవారితో పాటు గ్రామస్తులు కూడా ప్లాస్టిక్ వ్యర్థాల పొగను పీల్చాల్సి వస్తోంది. అధికారుల లెక్కల ప్రకారం ప్రస్తుతం 14 సంపద సృష్టి కేంద్రాల నిర్వహణ జరుగుతోంది. అయితే అందుకు భిన్నంగా సంపద సృష్టి కేంద్రాలు

చెత్త సేకరణ చేయడం లేదు

> గ్రామంలో ఇంటింటి చెత్త సేకరణ జరగడం లేదు. గ్రామంలో ఎక్కడి చెత్త అక్కడే కుప్పలుగా ఉంటోంది. కనీసం ఏఒక్క అధికారి కూడా ఈ విషయంలో పట్టించుకున్న పాపాన లేదు.
>
> – ఎ.లక్ష్మణ, జిల్లేడువలస

దర్శనమిస్తున్నాయి. జిల్లేడువలస పంచాయతీలో కనీసం చెత్త సేకరణ జరగడం లేదని ఆ గ్రామస్తులు చెబుతున్నారు. దీంతో ఎక్కడి చెత్త అక్కడే దర్శనమిస్తోంది. అలాగే పెదబోరబంద పంచాయతీలో చెత్తశుద్ధి కేంద్రం నిర్వహణ జరగడం లేదు. పారన్నవలస గ్రామంలో చెత్త శుద్ధి కేంద్రం తుప్పలు డొంకలతో దర్శనమిస్తోంది. కొన్ని గ్రామాల్లో అయితే చెత్త శుద్ధి కేంద్రాలు గ్రామానికి దూరంగా ఉండడంతో ఆ కేంద్రాలకు చెత్తను తీసుకెళ్లే పరిస్థితి కూడా లేదు. ఇలా సంపద సృష్టిస్తామని చెబుతున్న ప్రభుత్వం కనీసం ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదని స్థానిక పరిస్థితులు స్పష్టం చేస్తున్నాయి.



నిర్వహణకు నోచుకోని పారన్నవలస సంపద సృష్టి కేంద్రం



తుప్పలతో నిండిన నాడెప్‌లు